## పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విశాలాంధ్ర - విశాఖ: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, పోర్టు సొంత నిధులతో పోర్టు హాస్పటల్‌ను ఆధునీకరించాలని విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి టీ.సీ.హెచ్.మసేను అన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత కొన్ని రోజుల నుండి జరుగుచున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు తమ నిరసనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

## పాఠశాలకు, దేవాలయాలకు సమీపంలో మద్యం షాపులకు అనుమతి ఇవ్వొద్దు

### సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: మద్యం అమ్మకాలను ప్రజలు వ్యతిరేకస్తున్న చోట, పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వ విద్యాలయాలకు, దేవాలయాలకు దగ్గరగా అనుమతులు ఇవ్వొద్దని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యా మ్నాయ ఆదాయ వనరులను రాష్ట్ర ప్రభుత్వం అన్వేషించకుండా మద్యం మాత్రమే ఆదాయ వనరుగా చూడడం సరికాదని అన్నారు. మద్యం షాపులను తమ ప్రాంతంలో పెట్టవద్దని పలు ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని, మద్యం షాపులు పెట్టవద్దని కోరారు.

## సామాన్యులపై ధరల పిడుగు

### నిత్యావసర ధరల అదుపు బాధ్యత ప్రభుత్వానిదే - సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - పియం పాలెం: దేశవ్యాప్తంగా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో గల పాత మధురవాడ మెట్టలో ఇంటి ఇంటికి పెరిగిన ధరలపై కరపత్రాలు పంచే కార్యక్రమంలో పాల్గొని పైడిరాజు మాట్లాడారు. సామాన్య జనం నోట్లోకి నాలుగువేళ్లు పోవాలంటే గగనం అవుతుందని, ధరల భారం కోట్ల కుటుంబాలను పస్తులు పెడుతుందన్నారు. ఉద్యోగం ఉన్నవారు కూడా ఏ సామాన్లకనో, కాయగూరలకనో సంచి పట్టుకుని బయటకు వెళ్ళాలి అంటే ధరల దెబ్బ వణుకు పుట్టిస్తుందని, అన్ని రకాల వస్తువుల ధరలు కొండెక్కి కూర్చున్నాయని, ఉప్పు పప్పు మొదలు కూరగాయల దాకా ముట్టుకోవాలి అంటేనే భయం వేస్తుందన్నారు.

నిత్యావసరాల ధరలు చుక్కలను తాకితే, వంట నూనెలు, బియ్యం, పప్పులు ధరలు భగ్గుమంటున్నాయని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని ధరలు అదుపులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు టి.సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కుడిపూడి అరుణ్ కుమార్, ఎన్.త్రినాథ్, పెంటపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 16, 17 తేదీలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ జిల్లా ఏఐఎస్ఎఫ్ 32వ మహాసభలు నవంబర్ 16, 17 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు. నాగరాజు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం అల్లిపురం సిపిఐ కార్యాలయంలో పి.శేఖర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకి జిల్లాలో ఉన్న విద్యార్థులందరూ అధిక సంఖ్యలో హాజరై మహాసభ విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ మహాసభలో నూతన జిల్లా కార్యవర్గంతో పాటు జిల్లా సమితిని ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు శివరాజ్ కుమార్, శివరామ్ రెడ్డి, సందీప్, కిరణ్, లవ కుమార్, సూర్య, గణేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తాం: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 25వ తేదీన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో తొలి సారిగా జిల్లాకు విచ్చేస్తున్న ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో ఆ రోజు మధ్యాహ్నం జిల్లా అధికారులతో భేటీ అవుతారని చెప్పారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరి పాలనా పరమైన అంశాలపై చర్చిస్తారని అన్నారు. అన్ని విభాగాల హెచ్.ఓ.డి.లు సంబంధిత శాఖల్లో చేపట్టిన పనులపై, సాధించిన విజయాలపై పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారికి సూచించారు.

### అదే రోజు ఉదయం భీమిలి నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష

25వ తేదీ ఉదయం ఆనందపురం మండల పరిధిలోని సి.కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో నియోజకర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఆర్డీవో సమక్షంలో సమీక్ష జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో కూడిన నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

## హైవేపై బస్సు షెల్టర్ ఏర్పాటు చేయండి

### ఆర్టీసీకి ప్రయాణికుల విజ్ఞప్తి

విశాలాంధ్ర - ఆనందపురం: హైవేపై బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. బ్రిడ్జి పైన విశాఖ వెళ్లే ప్రయాణికులకు కనీసం ఒక బస్సు షెల్టర్ లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఎండా వాన కాలంలో తరచూ తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అందువల్ల హైవే అధికారులు ఆర్టీసీ యాజమాన్యం దృష్టి పెట్టి ఒక బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు కొంతమేర ఇబ్బందులు లేకుండా ఉంటుందని అంటున్నారు. రద్దీ ప్రదేశాలలో ఆనందపురం జంక్షన్ ఒకటి అని ఇటువంటి జంక్షన్లో షెల్టర్ లేకపోవడం చాలా బాధాకరమైన విషయమని అనేక మార్లు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇకనైనా బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చూడాలని పలువురు కోరుతున్నారు.

## బాధితుడికి అండగా బోస్ బాబు

### కిడ్నీ బాధితుడికి రూ.25 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. వివరాల్లోకెళ్తే వేములవలస గ్రామానికి చెందిన బోనేల ఈశ్వరరావు (52) అనే వ్యక్తికి కిడ్నీలు ఫెయిల్ అవడంతో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి అధికంగా ఖర్చు అవడంతో ఈ విషయంపై వైద్య ఖర్చులు నిమిత్తం శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేతకు తెలియపరచగా, తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే సంప్రదించాలని తెలిపారు. కిడ్నీ బాధితుడు కుమారుడు అనిల్ కుమార్ శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత బోస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## షికారు యాత్రలకు కార్పొరేటర్లు

### బెంగుళూరుకు చేరుకున్న కార్పొరేటర్లు

### భారీ కలెక్షన్‌తో విశాఖ నుంచి బయలుదేరిన కార్పొరేటర్ల బృందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రజాధనంతో స్టడీ టూర్ పేరిట విహారయాత్రలకు వెళ్లిన కార్పొరేటర్ల వైఖరిపై విశాఖ వాసులు పెద్ద ఎత్తున అసహనం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నగరంలో అనేక వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేని కార్పొరేటర్లు, ఇతర ప్రాంతాల్లో ఏం అధ్యయనం చేసి ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తారని మేధావులంతా అభిప్రాయ పడుతున్నారు. ప్రజలు పన్నుల ద్వారా చెల్లించిన ప్రజాధనాన్ని వృధా చేసేందుకే కార్పొరేటర్లు విహారయాత్ర చేస్తున్నారని అనేకమంది అంటున్నారు. ప్రతి ఏటా జీవీఎంసీ కార్పొరేటర్లు దేశంలోని అనేక ప్రాంతాలు అధ్యయన యాత్ర పేరిట విహారయాత్రలు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారిన వైసీపీ, టీడీపీ పాలక పక్షాలు ప్రజా ధనాన్ని వృధా చేసేందుకే పెద్దపేట వేస్తున్నాయని అనేకమంది అభిప్రాయ పడుతున్నారు. మరోపక్క విహారయాత్ర పేరిట జీవీఎంసీలో అన్ని విభాగాల నుండి అక్రమ వసూళ్లు చేపట్టి, దాదాపు రూ.2 కోట్ల మేర చందాల పేరిట వసూలు చేసి ఈ విహారయాత్రకు వెళ్లినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూతోపాటు స్మార్ట్ సిటీ, ప్రాజెక్టులు, మెకానికల్, నీట్ సరఫరా, ఉద్యానవన విభాగం, ప్రజా ఆరోగ్యం వంటి విభాగాల్లో ఆయా విభాగాల ఉన్నతాధికారులతో పాటు కిందిస్థాయి అధికారుల దగ్గర లక్షల్లో విహారయాత్రకు ఖర్చులు పేరిట వసూలు చేసినట్లు ఇచ్చిన వారే బహిరంగంగా తెలియజేస్తున్నారు. జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రలో 85 మందికి 71 మంది సోమవారం రాత్రి బెంగుళూరు చేరుకున్నారు. వీరితోపాటు 14 మంది జీవీఎంసీ సిబ్బంది ఒక డాక్టర్‌తో కలిపి ఈ అధ్యయన యాత్రలో పాల్గొన్నారు. అధ్యయన యాత్ర కోఆర్డినేటర్‌గా జీవీఎంసీ సెక్రెటరీ బి.వి.రమణ వ్యవహరిస్తున్నారు. అధ్యయన యాత్ర ఎన్ని రోజులు ఎక్కడెక్కడికి వెళ్తున్నారనే వివరాలు ఇటీవల జీవీఎంసీ సెక్రెటరీ తెలిపారు.

## శాంతియుత సమాజానికి పోలీసుల త్యాగాలే మూలం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ బీచ్ రోడ్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, జిల్లా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అమరులైన పోలీసులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబాలుకు ఫ్లాగ్ ఫండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా సీపీలు పోలీసుల నుండి గౌరవ వందనం అందుకున్నారు. పోలీసుల సేవలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల రక్షణలో పోలీస్ సేవలు కీలకమని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ జి.వి.ఎమ్.సి కమిషనర్ సంపత్ కుమార్, పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి విశాఖపట్నంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో పర్యటన సందర్భంగా సోమవారం ఉదయం వాయు మార్గం ద్వారా విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన చేరుకున్నారు. ఈ క్రమంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌లు ఉప ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి రోడ్డు మార్గం ద్వారా గుర్ల పయనమయ్యారు.

## ఐటీ హిల్స్‌కు నాలుగు ఆర్టీసీ బస్సులు

### ప్రారంభించిన ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - సాగర్ నగర్: రుషికొండ ఐటీ హిల్స్‌లోని ఇన్ఫోసిస్ నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన నాలుగు ప్రత్యేక సర్వీసులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీ భరత్ సోమవారం ప్రారంభించారు. ఐటీ హిల్స్ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వమే వీటిని ఉచితంగా నడుపుతోందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఐటీ ప్రోత్సాహకంలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఐటీ పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ నాలుగు బస్సులు పాత గాజువాక, కూర్మన్నపాలెం, పెందుర్తి, విజయనగరం నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి ఐటీ హిల్స్‌కు చేరుతాయి. వీటితో పాటు గాజువాక, ద్వారకా బస్ స్టేషన్ నుంచి అదనంగా మరో రెండు బస్సులు ఐటీ హిల్స్ కు నడుపుతున్నామని ఆర్టీసీ ఇన్‌చార్జి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ప్రాంగణాన్ని గంటా, భరత్ సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోరాడ రాజబాబు, ఆర్టీసీ డిప్యూటి సీటీఎం జి.సత్యనారాయణ, ఏపీ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ మేనేజర్ కీర్తన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు ఏర్పాటుకు అమృతరావు కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం తన ప్రాణాలనే ఫణంగా పెట్టిన మహనీయుడు, ఉక్కు సాధకుడు స్వర్గీయ తమనంపల్లి అమృతరావు కృషి మరువలేనిదని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. ఉక్కు నగరంలోని అమృతరావు పార్కులో స్వర్గీయ అమృతరావు 105వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అమృతరావు విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మిషన్ కన్వీనర్ ఏ.వి.రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చింతలపూడి మాట్లాడుతూ విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేపట్టి ఉక్కు కర్మాగారం స్థాపనకు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, యు.రామ స్వామి, కె.పరంధామయ్య, జి.ఆనంద్, విల్లా రామ్మోహన్ కుమార్, రాంకుమార్, బి.అప్పారావు, బూసి వెంకటరావు, పట్టా రామ అప్పారావు, జెర్రిపోతుల మోహన్ కుమార్, కోరాడ వెంకట్‌రావు, గాంధీ మిషన్ చైర్మన్ టి.మోహన్ గాంధీ, ఎస్.మోహన్ బాబు, సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, బయ్యే మల్లయ్య, మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - భీమిలి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తెచ్చే ఫిర్యాదులకు పరిష్కారం దొరుకుతుందనే భరోసా ప్రజలకు కల్పించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. దీన్ని మొక్కుబడిగా భావిస్తే ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి ఎవరూ ముందుకు రారని పేర్కొన్నారు. భీమిలి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ఆయనే స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి వారం రెండు, మూడు ఫిర్యాదులకు మించి రాకపోవడాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. ప్రజల్లో నెలకొన్న నిస్తేజాన్ని తొలగించి, అధికారులకు దిశా నిర్దేశం చేయడానికే ప్రతి సోమవారం ఏదో ఒక మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వయంగా పాల్గొంటున్నానని వివరించారు. కేవలం అధికారుల జోక్యంతో, శాఖల మధ్య సమన్వయంతో అనేక ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అలాంటి సమస్యల విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, తొందర్లోనే 3 ఉచిత సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఉచిత ఇసుక అమలు చేయడానికి రూ.300 కోట్ల సీనరేజిని ప్రభుత్వం వదులుకుందన్నారు. భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు కోరాడ రాజబాబు, కె.రామానాయుడు, డి.ఎ.ఎన్. రాజు, గాడు అప్పలనాయుడు, ఆర్డీఓ కె.సంగీత్ మాధుర్, భీమిలి జెడ్.సి. పి.ప్రేమ ప్రసన్న వాణి, ఎమ్మార్వో రామారావు, ఎంపీడీఓ హనుమంతరావు, ఈఓఆర్డీ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి విజ్ఞప్తి మేరకు 75వ వార్డు నెల్లిముక్కులో అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేసుకొని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అదానీ గంగవరం పోర్టు వారు ఉచితంగా ప్రతి సోమవారం ఉదయం 9:00 గంటల నుంచి 11:00 గంటల వరకు, నెల్లి ముక్కు స్టేజీ వద్ద 11:30 నుండి 1:30 వరకు, నీలాపు వీధి కృష్ణుడి గుడి దగ్గర మధ్యాహ్నం 3:00 గంటల నుంచి 5:00 గంటల వరకు సీతానగరం సచివాలయం పక్కనున్న గవర్నమెంట్ స్కూల్ వద్ద నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, 75వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి పెరుమాల్, శ్రీముసిరి శ్రీనివాసరావు, పెద్దాడ సోము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, విశాఖ పార్లమెంటరీ లీగల్ సెల్ మీడియా కో ఆర్డినేటర్ బస అప్పల రెడ్డి, దొమ్మేటి సోము నాయుడు, టేకేటి అప్పారావు, ఊరుకుటి అప్పల రాజు, మొల్లి నాగేశ్వరరావు, ఊరుకుటి అప్పారావు, కాకినాడ రాజుభాయ్, మొల్లి సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి రూ.3 లక్షలు విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి నిత్యాన్న ప్రసాదానికి హస్య మూవీస్ జూబిలీ హిల్స్ హైదరాబాద్‌కు చెందిన రాజేష్ దండా రూ.1,00,116 /-లు, అపర్ణ దండా రూ.1,00,116/-లు, శాన్వి, హాస్య రూ.1,00,116/-లు స్వామివారి నిత్యాన్న ప్రసాదంకు విరాళంగా మూడు లక్షల 348/- రూపాయలు చెక్కుల రూపంలో కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావుకు అందించారు. వీరితోపాటు ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఎన్.ఆనంద్ కుమార్, ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి విక్రం, జీవిఎస్ఎస్‌కె ప్రసాద్, పిఆర్ఓ నాయుడు ఉన్నారు. దాతలకు స్వామి వారి దర్శనం అనంతరం ఈఓ వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## శ్రీ బంగారమ్మ తల్లి ఆలయ పునః ప్రతిష్ఠ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం విలాస్కన్ పాలెం గ్రామంలో సోమవారం శ్రీ బంగారమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఆదివారం నుంచే ఆలయ ప్రాంగణంలో హోమాలు, విశేష పూజలు నిర్వహించి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం నాలుగు గంటలకు పురవీధుల్లో ఊరేగింపు చేశారు. మరుసటి రోజు సోమవారం కలశ స్థాపన, విగ్రహాలకు ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయ పున ప్రతిష్ట కార్యక్రమానికి గ్రామంలోని ప్రతి కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతి ఇంట పండగ వాతావరణంతో జరుపుకున్నారు. సోమవారం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వచ్చిన ఫిర్యాదులే మళ్లీ రాకుండా చూడండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వచ్చిన ఫిర్యాదులే మళ్లీ రాకుండా ప్రజలు సమర్పించే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులన ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ముందుగా

### కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

గత వారం ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీ క్షించారు. నిర్ణీత కాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలని, మళ్లీమళ్లీ రాకుండా జాగ్రత్త వహిం చాలని సూచించారు. అవసరమైతే జిల్లాస్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడాలని, పూర్వాపరాలు తెలుసుకొని సంతృప్తికర స్థాయిలో పరిష్కారం తీసుకోవాలని చెప్పారు.

వివిధ సమస్యలపై పీజీఆర్ఎస్‌కు 230 వినతులు

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 230 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 84, జీవీఎంసీకి చెందినవి 65, పోలీసు శాఖకు సంబంధించి 12, ఇతర శాఖలకు సంబంధించి 69 ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జీవీఎంసీ సంసిద్ధం

### - జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి తుఫానుగా మారే అవకాశం ఉన్నందున పొంచివున్న తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జివిఎంసి యంత్రాంగం సిద్ధంగా ఉందని, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి తుఫానుగా మారే అవకాశం ఉన్నందున ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించుటకు గానూ జివిఎంసి యంత్రాంగం సిద్దంగా ఉందని, అలాగే నగరంలో ఉన్న కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ విషయమై విశాఖ జిల్లా కలెక్టరు ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు జివిఎంసి యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారన్నారు. తుఫాన్ ప్రభావం వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ పునరావాస కేంద్రాలను సిద్ధం చేసిందని కమిషనర్ తెలిపారు. తుఫాన్ వలన చెట్లు విరిగిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని ఎప్పటికప్పుడు తొలగించుటకు వాహనాలను, ట్రీ కటింగ్ మిషన్లను, సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. అలాగే తుఫాన్ ప్రభావం వలన ఈదురుగాలులు వీసే అవకాశం ఉన్నందున విద్యుత్ స్తంభాలు విరిగే ప్రమాదం ఉందని అందుకు తగిన విధంగా అధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే జీవీఎంసీ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కమీషనరు సూచించారు. 600 మందితో రాపిడ్ రెస్క్యూ టీమ్ లను ఏర్పాటు చేశామని వారి ద్వారా నిరంతరం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని, అలాగే సహాయక చర్యల కొరకు జెసిబిలు-16, టిప్పర్లు-16 లను సిద్ధం చేయడమైనదన్నారు. కాలువలు పొంగిపొర్ల కుండా ముందస్తుగా కాలువలలో పూడికను తొలగించి వర్షపు నీరు సాఫీగా సాగే విధంగా కాలువలను పరిశుభ్రపరచడమైం దన్నారు. ప్రజలకు అందించవలసిన త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చేయుటకు జనరేటర్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించడమైందన్నారు. 36 పల్లపు ప్రాంతాలను గుర్తించి వాటికి మ్యాపింగ్ చేసి నిరంతరం పర్యవేక్షణ చేయడమైందని తెలిపారు. శిథిల వ్యవస్థలో ఉన్న పురాతన భవనాలను గుర్తించి అందులో ఎవరైనా నివసిస్తే వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కాలువలలో అడ్డంకులను ఎప్పటికప్పుడు తొలగించి వర్షపు నీరు సాఫీగా పోయే విధంగా పర్యవేక్షించాలని, పల్లపు ప్రాంత ప్రజలు, కొండవాలు ప్రాంత ప్రజలు అను నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను సంభవించినప్పుడు జరిగిన ఇబ్బందులను తెలియజేయడానికి జివిఎంసి టోల్ ఫ్రీ 1800 4250 0009 నెంబరుకు ప్రజలు తెలియజేయవచ్చునని కమీషనరు విజ్ఞప్తి చేశారు.

## విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై గల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారిని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు సతీ సమేతంగా దర్శించుకున్నారు. పంచకర్ల దంపతులకు వేద పండితులు వేదాశీర్వాదం అందజేసారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

## విజయవాడ బాధితులకు సోములు విరాళం

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఇటీవలే విజయవాడలో వచ్చిన వరదలకు లక్షల సంఖ్యలో ప్రజలు ఆస్తులను నష్టపోయారు. రైతులు కొన్ని లక్షల ఎకరాల పంటను కోల్పోయారు. సుమారు 45 మంది ప్రాణాలు పోయాయి. అనేకమంది కూలీ నాలి పనులు చేసుకునే వారే కాకుండా దుకాణాలు, షాపులు సర్వం కోల్పోయారు. అనేక విధాలుగా విజయవాడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారికి సహాయ సహకారాలు రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ ఎంతో భారీగా ప్రజలు ప్రాణాలతో పాటు వారి ఆస్తులు నష్టపోయారు. అలాంటి ఆపన్నులకు ఆదుకోవడంలో మన రాష్ట్రంలో ఉన్న అనేక మంది ప్రముఖులు, అలాగే ప్రముఖ సంస్థలు, కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా సహాయం చేస్తున్నారు. అలాగే దేశంలో ఉన్నటువంటి అనేకమంది వారికి ఆర్థిక సహాయం ప్రభుత్వానికి అందిస్తున్నారు. మరి కొంతమంది శ్రమదానంతో కొన్ని వేలమంది ప్రజలకు సేవలు చేస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు నేరుగా వారికి సాయం చేస్తున్నారు. అదే బాటలో గ్రేటర్ విశాఖ 92వ వార్డు, పద్మనాభ నగర్ గ్రామానికి చెందిన నందవరపు సోములు కలెక్టర్ కార్యాలయంలో డి.ఆ.ర్ఓ. మోహన్ కుమార్‌కి సీఎం రిలీఫ్ ఫండ్‌కు 20,000/- రూపాయలు డిడిని అందజేశారు.

## రాష్ట్ర స్థాయి క్రీడలకు సిర్లపాలెం పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఈ నెల 19వ తేదిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లా కోకో అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ కోకో సెలక్షన్‌లో సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థు నులు పోతల వాగ్దేవి, రామునేని పేట గ్రామం, రేవతి రేగానిగూడం గ్రామం చెందిన వారు అత్యంత క్రీడా ప్రతిభ కనబర్చి ఈ నెల 25వ తేది నుండి 27వ తేది వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరగబోవు రాష్ట్రస్థాయి జూనియర్ కోకో పోటీలలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తరపున అర్హత సాధించారు. అలాగే పోతల వాగ్దేవి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో నవంబర్ 2, 3, 4 న జరగబోవు అండర్ 17 ఇయర్స్ రాష్ట్రస్థాయి కోకో పోటీలకు అర్హత సాధించింది అని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బుత్తల సత్యం తెలిపారు. కోకో క్రీడలో సత్తాచాటి పాఠశాలకు గ్రామానికి మంచి గుర్తింపు తెచ్చిన విద్యార్థినీలను, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యంను పాఠశాల హెచ్ఎం శారద, పాఠశాల సిబ్బంది, పాఠశాల చైర్మన్ కోరాడ గౌరి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్ అప్పల నాయుడు, ఎంపీటీసీ బోణి అప్పల నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

## చెత్త నుండి సంపదను సృష్టించండి

విశాలాంధ్ర - ఆనందపురం: మండల అభివృద్ధి అధికారి జానకి సోమవారం కుసులవాడ పంచాయతీలో పరిశీలించారు. అందులో భాగంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో తడి పొడి చెత్తను వేరుచేసి ఎరువును తయారు చేయాలని, అలాగే పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రపరుచుకోవాలని, సచివాల యంలో పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, శివాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పోలియో వ్యాధిపై అప్రమత్తత అవసరం

### డాక్టర్ పి.సతీష్ కుమార్

విశాలాంధ్ర - విశాఖపట్నం: పోలియో వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ శిశు వైద్యులు, సత్య చైల్డ్ క్లినిక్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ పి.సతీష్ కుమార్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకా ద్వారా నివారించగల వ్యాధిపై పోరాటానికి అందరూ ఏకం కావాల్సి వుందన్నారు. భారతదేశంలోనిమేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో ఈ ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం అన్నారు. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుందని, ఇది కోలుకోలేని పక్షవాతం మరియు కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుందన్నారు. పోలియో వ్యాక్సిన్ (ఐటివి), 16-18 నెలలలో మళ్లీ 4-6 సంవత్సరాలలో బూస్టర్‌లు వేయించాలని తెలిపారు.

## యూనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణకు ఆంధ్ర రత్న పురస్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి మండలం సరిపల్లి గ్రామానికి చెందిన కోనేటి ఆదినారాయణ అరుదైన ఆంధ్ర రత్న పురస్కారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన 24వ అఖిల భారత సంస్కృతిక మహెూత్సవ కార్యక్రమంలో ఐఏఎస్ అదికారిణి శ్రీ లక్ష్మి కాంతం, అన్నమయ్య జిల్లా జడ్జి డాక్టర్ పసుపులేటి శంకర్, కర్ణాటక సినీ నటి పంకజం, అఖిల భారత సాంస్కృతిక సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి వివిధ రంగాలలో సేవలు అందించిన ప్రముఖులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డ్స్ ఇస్తున్నారు. గత 20 సంవత్సరాలనుండి ఆదినారాయణ అందిస్తున్న సమాజ సేవలు, రక్తదాన సేవలు, అనాథలకు, అంధులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డ్‌కు ఎంపిక చేయడం జరిగిందని డాక్టర్ విజయ్ కుమార్ తెలియజేసారు. ప్రస్తుతం ఆదినారాయణ యూనిక్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా, ఆంధ్ర ఫోకస్ జర్నలిస్ట్‌గా, సంఘ సంస్కరణ పక్ష పత్రికకు రైటర్‌గా సేవలు అందిస్తున్నారు.

## రెడ్డి వీధిలో గైరమ్మ సంబరాలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం రెడ్డి వీధిలో గైరమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభించారు. సోమవారం ఆ ప్రాంతానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కాకి పొలిరెడ్డి కుటుంబం అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించి వివిధ సంస్కృతి కార్యక్రమాలు ముఖ్యంగా కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముగ్గురు టెకీ ఔత్సాహికుల జీవితాలను తీర్చిదిద్దిన "మసాయి స్కూల్"

విశాలాంధ్ర- విశాఖపట్నం: నేషనల్: దేశవ్యాప్తంగా దాదాపు 5 వేల మందికి పైగా విద్యార్థుల కలలను సాకారం చేస్తూ.., వారు అందిపుచ్చుకునే అవకాశాలకు నైపుణ్యాలను అనుసంధానం చేసే వారధిగా అద్భుత వేదికను అందిస్తుంది మసాయి స్కూల్. దేశవ్యాప్తంగా వినూత్న ఫలితాలను అందించే కెరీర్ ఇన్స్టిట్యూట్‌గా గుర్తింపు పొంది, ఇప్పటి వరకు 100 పైగా ఎక్కువ బ్యాచ్‌లకు శిక్షణ అందించింది. గత కొన్నేళ్లుగా విశేషమైన సేవలతో 6,000 పైగా శిక్షకుల నమోదులతో తన ప్రశస్తిని కొనసాగిస్తుంది. ఈ నెలలో ఘనంగా ఐదేళ్ల పూర్తి చేసుకున్న ఈ సంస్థ.., ప్రస్తుత విద్యా వ్యవస్థను ఫలితాల ఆధారితంగా మార్చడంతో దేశ మానవ సామర్థ్యాన్ని పునరుద్దరీకరించాలనే ఏకైక లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ముందుకు సాగుతుంది. విశాఖపట్నానికి చెందిన యువకుడు నాగ అప్పారావు పొలమరశెట్టి మెకానికల్ ఇంజినీరింగ్‌లో కెరీర్‌ను ప్రారంభించారు. అతనికి విద్య-నైపుణ్యాల పరంగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ..ఈ రంగంలో ఉద్యోగాలను పొందడంలో చాలా కష్టపడ్డాడు. నాగ అప్పారావు మాసాయి స్కూల్‌కు ఆన్‌లైన్ పోస్ట్‌లో "పే ఆఫ్టర్ ప్లేస్‌మెంట్ మోడల్"లో చేరారు. అనంతపురంలో వ్యవసాయ కుటుంబంలో పెరిగిన నాగలక్ష్మి, కర్నూల్‌కు చెందిన హర్ష వర్ధన్ మీరు కూడా మసాజ్ స్కూల్లో చేరి రాణించారు.

# హెచ్.పి.సి.ఎల్ ఇంధనం లాయల్టీ పాయింట్ల ద్వారా జీవీఎంసీకి 39.19 లక్షల ఆదాయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ వాహనాలకు హెచ్.పి.సి.ఎల్ ఇంధనం వినియోగించడం ద్వారా జీవీఎంసీకి 39.19 లక్షల రూపాయలు లాయల్టీ పాయింట్ల ద్వారా ఆదాయం లభించిందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో హెచ్.పి.సి.ఎల్ లాయల్టీ పాయింట్ల ద్వారా జీవీఎంసీకి చేకూరిన 39.19 లక్షల చెక్కును హెచ్.పి.సి.ఎల్ రీజనల్ మేనేజర్ బి.రవికాంత్ నుండి కమిషనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మెకానికల్ విభాగం ద్వారా జీవీఎంసీకి చెందిన అన్ని వాహనాలకు హెచ్.పి.సి.ఎల్ ఇంధనం వినియోగించడం ద్వారా 39.19 లక్షల రూపాయలు జీవీఎంసీకి ఆదాయం లభించిందని, విశాఖ నగరంలోనే హెచ్‌పిసిఎల్ ఇంధనం సరఫరా చేయు పరిశ్రమలు, సంస్థలలో జీవీఎంసీ ప్రథమ స్థానంలో ఉండటమే కాకుండా 3 సంవత్సరముల కాలానికి గానూ అత్యధిక లాయల్టీ పాయింట్లను జీవీఎంసీ పొందడం ద్వారా ఈ ఆదాయం జీవీఎంసీకి చేకూరిందన్నారు. ఈ చెక్కును అందించిన హెచ్.పి.సి.ఎల్ ప్రతినిధులకు కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆదాయం లబ్దిలో సృజనాత్మకంగా విధులు నిర్వహించిన జీవీఎంసీ మెకానికల్ విభాగం ఇంజనీర్లను కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాద్ రాజు, పర్యవేక్షక ఇంజనీర్ జి.గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ కె.దిలీప్, హెచ్.పి.సి.ఎల్ సేల్స్ ఆఫీసర్ కె.శ్యాంసుందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ్ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కో కర్కులర్ యాక్టివిటీలో భాగంగా ది చోడవరం కో-ఆప్ షుగర్స్ లిమిటెడ్ (చోడవరం) ఆపిల్ ఇంటీరియర్స్ (గుర్రం పాలెం) ను సందర్శించారని ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలియజేశారు. మేనేజ్మెంట్ లెక్చరర్ బి.ఆర్.జి పరిమళ ఆధ్వర్యంలో 20 మంది బి.బి.ఏ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ చేశారని తెలిపారు. ప్రాక్టికల్‌గా పరిశ్రమలను విజిట్ చెయ్యడం ద్వారా విద్యార్థికి అనుభవం వస్తుందని, ఈ విజిట్‌లో విద్యారులు ప్రొడక్షన్, డిజైనింగ్, మానుఫాక్చరింగ్ మొదలగు విషయాలపై అవగాహన పొందారని వెల్లడించారు. ఈ విజిట్ విద్యార్థులకు భవిష్యత్తులో బాగా ఉపయోగ పడుతుందని కంప్యూటర్ లెక్చరర్ డి.ఎస్.ప్రదీప్ వివరించారు. ఇటువంటి విజిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమలకు విద్యా వ్యవస్థకు మధ్య దూరం తగ్గుతుందని బిబిఏ విద్యార్థి వి.జయవర్ధన్ వివరించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టి. థియోఫిలస్ మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కొరతగా వుందని, దీంతో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాలకు పరిమితం చేయకుండా ఇండస్ట్రీస్‌కి తీసుకెళ్లడం వల్ల వారిలో నైపుణ్యాలు పెరుగుతాయని తెలియజేశారు. ఈ విజిట్ విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులు బి.ఆర్.జి పరిమళ, డి.ఎస్.ప్రదీప్, విద్యార్థులను ఆదర్శ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అభినందించారు.

# టీడీపీ సభ్యత్వ నమోదుకు సిద్ధంకండి

### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పిలుపు

విశాలాంధ్ర - భీమిలి: టీడీపీ తమ్ముళ్లు, అక్క చెల్లెమ్మలకు కొండంత భరోసా ఇచ్చే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మన అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పచ్చ జెండా ఊపారని అందరూ సిద్ధం కావాలని కేడర్‌కు టిడిపి భీమిలి జోన్ 3వ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పిలుపునిచ్చారు. భీమిలి టీడీపీ పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మాట్లాడారు. ఈనెల 26వ తేదీ సోమవారం నుండి టీడీపీ శాశ్వత సభ్యత్వాలు ప్రారంభం అవుతున్నాయని ప్రతీ వార్డులో అత్యధిక నమోదు ప్రక్రియ జరిగేవిధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. మన యువనేత, రాష్ట్రమంత్రి నారా లోకేష్ బాబు ఆలోచన విధానంతో నూతనంగా రూపొందించబడిన సభ్యత్వ నమోదులో మహిళలు, యువత, సీనియర్లు అందరూ పాల్గొవాలని కోరారు. భీమిలి శాసనసభ్యులు, మన ప్రియతమనేత గంటా శ్రీనివాస రావు పిలుపుమేరకు రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వ నమోదు ప్రక్రియ భీమిలి నియోజకవర్గందే కావాలని అన్నారని అది నిజమయ్యే విధంగా కృషి చేసి యువనేత నారా లోకేష్ బాబుకి, గంటా శ్రీనివాసరావుకి బహుమతిగా ఇవ్వాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. 100 రూపాయలతో సభ్యత్వం నమోదు అవుతుందని అన్నారు. కార్యకర్త కుటుంబ సౌకర్యార్థం ప్రమాదంలో మరణిం చిన వారికి 5 లక్షల రూపాయలు బీమా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదేవిదంగా మరణించిన ప్రతీ సభ్యత్వం పొందిన కార్యకర్తకు మట్టిఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదేవిదంగా శాశ్వతసభ్యత్వం నమోదులో భాగంగా లక్ష రూపాయలు చెల్లించి జీవితకాలం టిడిపి సభ్యత్వం తీసుకోవచ్చని అన్నారు. ఈవిధంగా వచ్చిన డబ్బులతో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండేవిధంగా ఖర్చు చేస్తారని చెప్పారు. పేద విద్యార్థుల చదువులకు, అనారోగ్యం వస్తే కుటుంబానికి ఆసరా ఇవ్వడానికి తదితర ఖర్చుల నిమిత్తం ఉపయోగిస్తారని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు ఆలోచించే మన చంద్రన్న చరిష్మా నుండి పుట్టిన సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దాం, ప్రతీ నలుగురిలో ఒకరు టిడిపి సభ్యునిగా ఉండేవిధంగా ప్రణాళికతో ముందుకు వెళ్దామని గంటా నూకరాజు నాయకులు, కార్యకర్తలను కోరారు.

## పుట్టినరోజు నాడే విద్యార్థి ఆత్మహత్య

### పీఎం పాలెం గాయత్రి నగర్ కాలనీలో ఘటన

విశాలాంధ్ర - పీఎం పాలెం: విలాసాలకు అలవాటు పడుతున్న యువత కొన్నిసార్లు అవి దక్కకపోతే ప్రాణాలే పోగొట్టుకుంటున్నారు. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థి తల్లిదండ్రులు బైక్ కొనలేదని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న తల్లిదండ్రులు పిల్లల కోరికలు తీర్చకపోతే ఇలా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. పీఎం పాలెం గాయత్రీ నగర్ కాలనీలో పుట్టినరోజు నాడే ఓ విద్యార్థి ఉరివేసుకొని మృతి చెందాడు. 9వ బ్లాక్ రెండో అంతస్తు నాలుగో నెంబర్ ఇంటిలో నివాసం ఉంటున్న పేరిశెట్టి గణేష్ (17) బాసర కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పుట్టినరోజు నాడు తనకు తల్లితండ్రులు బైక్ కొని ఇవ్వలేదని మనస్థాపానికి గురై ఉరివేసుకున్నాడు. పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తమ కుమారుడు మరణంపై ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపించారు.

## పవన్‌కు స్వాగతం పలికిన మండల జనసేన నాయకులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు సోమవారం ఉదయం జనసేన ఆనందపురం జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు ఆధ్వర్యంలో జంక్షన్‌లో స్వాగతం ఏర్పాటు చేశారు. ఉదయం విజయవాడ నుండి విశాఖ చేరుకున్న డిప్యూటీ సీఎం విజయనగరం జిల్లా, గుర్ల గ్రామంలో డయేరియా బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న సందర్భంగా ఆనందపురం జంక్షన్‌లో మండల నాయకులు స్వాగత ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు జంక్షన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, గోవింద్, ప్రశాంత్, అప్పలరాజు, శంకర్, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మునగ చెట్టుతో ప్రయోజనాలు ఎన్నో...

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మనుషుల ఆరోగ్యానికి దోహద పడుతూ.. ఎన్నో పోషక విలువలు కలిగిన మునగ చెట్టు, ఆకుల ఆవశ్యకతను తెలుపుతూ

ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం సంబంధిత పోస్టర్ను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో, డీఈవో, ఐసీడీఎస్ పీడీ జయదేవిలతో కలిసి ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ మునగ చెట్టు, ఆకుల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతున్నాయని పేర్కొన్నారు. ఐరన్, ప్రొటీన్, విటమిన్ - ఎ, సీ, ఈ, విటమిన్ - బీ1, బీ2, బీ3, బీ6 లభిస్తాయని తెలిపారు. వీటితో పాటు కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ లభిస్తాయని ఆమె వివరించారు.

# జడ్పీ సర్వసభ్య సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 24వ తేదీన జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు పక్కా నివేదికలతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత సమావేశంలో ఆయా శాఖల పరిధిలో ప్రస్తావించిన అంశాలు, తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. గతంలో సభ్యులు లేవనెత్తిన ప్రజా సమస్యలపై చేపట్టిన చర్యలను క్షుణ్ణంగా వివరించాలని చెప్పారు. 24న జడ్పీ వేదికగా జరిగే సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు.

# వికలాంగులకు రూ.15 వేలు పెన్షన్ ఇప్పించండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: 85 శాతం అంగవైకల్యం ఉన్న వికలాంగులకు 15000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించింది. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ ఇతర జిల్లాలో ఇస్తున్నట్లే విశాఖ జిల్లాలో కూడా 15000 పెన్షన్ ఇవ్వాలని కోరారు. జిల్లాలో గత ప్రభుత్వం వివిధ కారణాలతో కొంతమందికి పెన్షన్ నిలిపివేసింది అన్నారు. వారందరికీ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. వికలాంగులకు ఒంటరి రేషన్ కార్డు, అంత్యోదయ కార్డు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామారావు, మల్లేశ్వరి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీలో సీనియర్ సహాయకులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులైన వి.ఎన్.ఎస్.ప్రసన్న, వై.ఎల్లమ్ నాయుడులకు పర్యవేక్షకులుగా (సూపరింటెండెంట్లు) పదోన్నతి కల్పిస్తూ జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో పదోన్నతి ఉత్తర్వులను అందించి వారిని అభినం దించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతి ఉద్యోగులకు మరింత బాధ్యతను గుర్తు చేస్తుందని, ఆ దిశగా విశాఖ నగర అభివృద్ధి కొరకు జీవీఎంసీ నుండి ప్రజలకు సేవలు అందించడంలో విధుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి సృజనాత్మకంగా విధులు నిర్వహించాలని పదోన్నతి పొందిన పర్యవేక్షకులకు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేపై అభ్యంతరాలుంటే తెలపండి

### తహశీల్దార్ పేర్లి శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - ఆనందపురం: జేసీ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వే పైలెట్ గ్రామాల్లో రీ సర్వేపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో నేరుగా రైతులు తెలియపరచవచ్చని తహశీల్దార్ శ్యాం ప్రసాద్ తెలిపారు. అందుకుగాను ఈ నెల 23 నుండి వచ్చే నెల 27 వరకు గ్రామ సభల ద్వారా అర్జీలను స్వీకరిస్తామని అందులో భాగంగా ఆయా విరియా సచివాలయ, పంచాయతీ కార్యాలయంలో గ్రామసభలు నిర్వహిస్తామని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం సబ్ స్టేషన్ లైన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో పాలవలస, తర్లువాడ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆనందపురం ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

# మాజీ ఎంపీ ఎంవీవీ ఇంట్లో 300 పైగా సేల్ డీడ్స్ స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మాజీ విశాఖ ఎంపీ, వైసిపి నేత ఎంవీవీ బిల్డర్స్ అధినేత, సినీ నిర్మాత(ఎంవివి క్రియేషన్స్) ఎంవివి సత్యనారాయణ ఇంటి పై ఈడీ దాడుల నేపథ్యంలో అధికారిక ప్రకటన ఈ డీ అధికారులు వెల్లడించారు ఎంవివి నివాసంలో గోల్డ్‌లో డిజిటల్ డివైజ్ (నకిలీ స్టాంప్ డాక్యుమెంట్ తయారు చేసే మిషన్స్), బినామీ పట్టాదార్ పాసు పుస్తకాలు, 300పై చిలుకు సేల్ డీడ్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీలో ఈ.డి అధికారిక ప్రకటన చేశారు. గత రెండు రోజుల క్రితం విశాఖలో ఎంవివి కార్యాలయాలు ,ఇల్లు లో ఈడీ సోదాలు జరిపిన విషయం విదితమే. హైగ్రీవ భూ లావాదేవీల్లో జరిగిన అక్రమాలపై కూడా ఈడి విచారణ జరిపినట్లు తెలిసింది.

# ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

### జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీకి సంబంధించిన ప్రజా ఫిర్యాదులు, కోర్టు కేసులు, ఆడిట్ అభ్యంతరాలు, ఈ -ఆఫీస్ అములు తదితర అంశాలపై జీవీఎంసీ విభాగాధిపతులు, స్టేట్ ఆడిట్ రీజినల్ డైరెక్టర్ సీతారామారావు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జోనల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, సంక్షేమ పథకాలు, సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత నిస్తుందని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తుందన్నారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ప్రజల నుండి ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులు, వినతులకు ప్రాధాన్య తనిస్తూ ప్రత్యేక శ్రద్ధతో నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, అన్ని వినతులు, ఫిర్యాదులపై నిర్లక్ష్యం, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని విభాగాధిపతులను, జోనల్ కమిషనర్లను కమిషనరు ఆదేశించారు. జీవీఎంసీకి సంబంధించిన కోర్టు కేసులు, రిట్ పిటిషన్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, కేసుల తీవ్రతను తగ్గించుటకు కావలసిన విషయంపై దృష్టి సారించి నిర్ణీత సమయంలో సంబంధిత కేసులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జీవీఎంసీలో వివిధ విభా గాలకు సంబంధించి ఆడిటర్ అభ్యంతరాలు, అడ్వాన్సులు తిరిగి చెల్లింపులు తదితర అంశాలపై స్టేట్ ఆడిట్ విభాగం వారి అభ్యంతరాలకు నిర్ణీత సమయంలో నిర్లక్ష్యం వహించకుండా సమా చారాన్ని అందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. జీవీఎంసీ అన్ని విభాగాలలో కార్యకలాపాలు, ఉత్తర ప్రత్యుత్తరాలను శత శాతం ఈ-ఆఫీస్ వ్యవస్థ ద్వారానే జరపాలని కమిషనర్ విభాగాధిపతులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ శివ ప్రసాదరాజు, అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, వ్యయ పరిశీలకులు ఎస్.వాసుదేవ రెడ్డి, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజనీర్లు రామ్మోహన్‌రావు, గోవిందరావు, సంపత్ కుమార్, శాంసన్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిడిహెచ్ ఎం.దామోదర్ రావు, సహాయ వ్యయ పరిశీలకులు ఆదినారాయణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ శ్రీనివాస్, డిసిపి రామలింగేశ్వర రెడ్డి, యుసిడి- పి.ఓ.డి లక్ష్మి, డిపిఓ లు ఎంవిడి పణిరామ్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 77 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" 77 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనరు డా.పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అధికారులతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 77 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 02, 2వ జోన్ కు 08, 3వ జోన్‌కు 14, 4వ జోన్‌కు 05, 5వ జోన్‌కు 16, 6వ జోనుకు 05, 7వ జోన్‌కు 01, 8వ జోన్‌కు 09, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 17 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్స్ విభాగమునకు 06, రెవెన్యూ విభాగమునకు 08, ప్రజారోగ్య విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 35, ఇంజినీరింగు విభాగమునకు 16, యు.సి.డి విభాగానికి 04 కలిపి మొత్తంగా 77 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద రాజు, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, డిసి(రెవెన్యూ) శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఎఫ్.ఏ&ఎ.ఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, శాంసన్ రాజు, రామమోహనరావు, సంపత్ కుమార్, డిపిఓ లు చంద్రిక, ఎం.వి.డి ఫణిరామ్, యుసిడి పి.ఓ డి.లక్ష్మి, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎన్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి, ఆర్.ఎఫ్.ఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితంగా దివ్వెల పండుగ నిర్వహిద్దాం

### - ఎకో వైజాగ్‌ను విజయవంతం చేద్దాం
### - గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పర్యావరణహితంగా దివ్వెల పండుగ నిర్వహిద్దాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం శివాజీ పాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో వైజాగ్ ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. పశు, పక్ష్యాదులకూ, వృద్ధులకూ, పిల్లలకూ హాని కలగకుండా సాంప్రదాయ బద్ధంగా దివ్వెల పండుగ నిర్వహిస్తామన్నారు. ఒకే రోజు లక్షలాదిమంది బాణాసంచా కాల్చితే కలిగే నష్టాలు వర్ణనాతీతం అన్నారు. ఉపాధ్యాయిని డాక్టర్ మురహరరావు ఉమా గాంధీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. ప్రతీ విద్యార్థి తమ కుటుంబం లోని అందరికీ

అవగాహన కల్పించాలన్నారు. బాణాసంచా మోతలతో నగరానికి నష్టం కలుగుతుందని ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి అని కోరారు. ప్రతీ మనిషి తమకు ఏదాది పొడవునా అవసరమైన ప్రాణవాయువు కోసం మొక్కలు నాటి పెంచాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ సోషల్ వర్క్ విద్యార్థినులు బి.ఉషారాణి, బి.తేజస్విని, ఆదమ్, వి.చైతన్య సరస్వతి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# పీఎం జీవన్ జ్యోతి, సురక్ష భీమా యోజన ప్రయోజనాలు ప్రజలకు వివరించండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకాల ఆవశ్యకతను, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని, వాటిల్లో అధిక మంది చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో భాగంగా వీటిపై మాట్లాడిన కలెక్టర్ 15, అక్టోబర్ 2024 నుంచి 15, జనవరి 2025 వరకు ప్రత్యేక క్యాంపెయిన్ జరుగుతుందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల పరిధిలోని 18 ఏళ్ల వయసు నిండిన కార్మికులు, యువత, మహిళలు, స్వయం ఉపాధి పొందే కార్మికులను చేర్పాలని అధికారులను ఆదేశించారు.

18-50 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు రూ.436 ప్రీమియం చెల్లించటం ద్వారా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజనలో, 18-70 ఏళ్ల వయసు కలిగిన వారు రూ.20 చెల్లించటం ద్వారా సురక్ష భీమా యోజనలో చేరవచ్చని సూచించారు. వీటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, సంబంధిత విభాగాల అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# 23న ఏపీ ప్రభుత్వ నర్సుల ఎన్నికలు

### అంకితభావంతో పని చేస్తామంటున్న అభ్యర్థులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఏపీ ప్రభుత్వ నర్సెస్ బ్రాంచి యూనిట్ ఎన్నికలు ఈ నెల 23న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తూ తమకు ఓ అవకాశం కల్పిస్తే అంకిత భావంతో పని చేస్తామని హామీలిస్తున్నారు. ముఖ్యంగా బి.ఉషారాణి ప్యానెల్‌లో జి.శాంతమ్మ, జైతు రవీంద్రనాథ్, ఎన్.ప్రశాంతి, ఎన్. పద్మజ, ఎం.సుజాతరావు, కె.వరలక్ష్మి పోటీలో ఉన్నారు. ఏళ్ల తరబడి రోగులకు సేవలందిస్తూ కరోనా సమయంలో నిద్రాహారాలు మాని మరీ పని చేశారు. ఈ ప్యానెల్‌ను కచ్చితంగా గెలిపించాలంటూ అబీబుల్లా ఖాన్ మెమోరియల్ సంఘం తరఫున ఆ సంఘం ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు కోరుతూ తమ మద్దతు తెలియజేశారు. అదే విధంగా రవీంద్ర నాథ్ జైతు మాట్లాడుతూ తాను ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా పోటీలో ఉన్నానని, తమ ప్యానెల్‌లో వారందర్నీ గెలిపించాలని కోరారు. 2018లో వాట్సాప్ గ్రూప్ తయారు చేసి సేవలందించానని, 48 మంది కాంట్రాక్ట్ బేస్ స్టాఫ్ నర్సులకు రెండేళ్ల పాటు నిలిపివేసిన జీతాల్ని ఇప్పించేందుకు కృషి చేశానని గుర్తు చేశారు. అంతేకాకుండా 12 అంశాలతో కూడిన ఓ మేనిఫెస్టోను కూడా తయారు చేసి ఉషారాణి, శాంతమ్మ, ప్రశాంతితో కలిసి జైతు రవీంద్రనాథ్ అందరికీ పంపిణీ చేస్తున్నారు.

# లాకర్‌లో భద్రంగా అప్పన్న బంగారం

విశాలాంధ్ర - సింహాచలం: సింహాచలం సింహాద్రి అప్పన్న భక్తులు హుండీల ద్వారా బంగారం రూపంలో కానుకలుగా సమర్పించిన కచ్చా బంగారం అప్రైజ్ చేయగా బంగారము 004.380.000 మిల్లీ గ్రాములు వచ్చింది. దీనిని లాకర్‌లో దేవాదాయ అధికారుల భద్రంగా ఉంచారు. సింహాచలం కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు, ఉప కార్యనిర్వహణాధికారి రాధా, రీజనల్ జాయింట్ కమిషనర్ సుబ్బారావు, జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లమరాజు, ఆలయ సహాయ కార్య నిర్వాహణ అధికారి ఎన్.ఆనంద్ కుమార్, సహాయ కార్యనిర్వాహణ అధికారి రమణమూర్తి, గోల్డ్ స్మిత్ సాంబమూర్తి, గోల్డ్ అప్రైజర్ శ్రీనివాసరావు, జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ కార్యాలయం వారితో ఏర్పడిన కమిటీ సభ్యులు సమక్షంలో మేనేజర్ ఎస్.బి.ఐ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ విశాఖపట్నం వారికి గోల్డ్ బాండ్ క్రింద సమర్పించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు తెలిపారు.